ప్రజాశక్తి
గురువారం 29 డిసెంబర్ 2022



అల్లూరి సీతారామరాజు

పేదోడి విద్యుత్ బిల్లు రూ.1,17, 273



ప్రజాశక్తి-ముంచింగిపుట్టు:మండలంలో విద్యుత్ శాఖ అధికారులు ఒక పేద కుటుంబానికి ఈ నెల విద్యుత్ బిల్లు రూ. 1,17, 273లు ఇస్తే ఆ బిల్లును చూసి ఏ విధంగా కట్టుకోవాలో తెలియక విలేకరులతో తన ఆవేదనని వ్యక్త పరిచారు. వివరాల్లోకి వెళ్తే.. మండల కేంద్రంలో విద్యుత్ సబ్ స్టేషన్ కి కూతవేటు దూరంలో గల పాతముంచింగిపుట్టు గ్రామానికి చెందిన అల్లంగి పరుశు రాం నివాసం ఉంటున్నాడు. 1 లక్ష 17వేల 273ల విద్యుత్ బిల్లు ఒకేసారి రావడంతో ప్రభుత్వం ఇచ్చే పెన్షన్ సైతం ఆగి పోతుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశాడు. ఒక రేకుల ఇంటిలో నివసిస్తున్న తనకు ఇంత ఎక్కువ బిల్లు ఏ విధంగా వచ్చిందో అర్థం కాలేదన్నాడు. ఈ సమస్య పరిష్కారానికి ఎవరి దగ్గరకు వెళ్లాలో తెలియలేదన్నాడు. ఇప్పటికైనా అధికారులు స్పందించి లక్షల్లో వచ్చిన విద్యుత్ బిల్లును సరి చేయాలని కోరాడు.

హైడ్రో పవర్ ప్రాజెక్ట్‌ల నిర్ణయాన్ని..

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెనక్కి తీసుకోవాలి

▸▸ సిపిఎం జిల్లా కార్యదర్శి అప్పలనర్స ▸▸ ప్రభావిత ప్రాంతాల్లో సిపిఎం బృందం పర్యటన ▸▸ గిరిజన ఆయుధాలతో నిరసన

ప్రజాశక్తి - అనంతగిరి :కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు హైడ్రో పవర్ ప్రాజెక్ట్‌ల నిర్మాణ నిర్ణయాలను తక్షణమే వెనక్కి తీసుకోవాలని, ఈ విషయమై ఈ నెల 30న నర్సీపట్నం వస్తున్న రాష్ట్ర ముఖ్య మంత్రి జగన్ మోహన్ రెడ్డి ప్రకటన చేయాలని సిపిఎం అల్లూరి సీతారామరాజు జిల్లా కార్యదర్శి పి.అప్పలనర్స డిమాండ్ చేశారు. అనంతగిరి మండలం పెదకోట పంచాయతీ రెగులాపాలెం కూడియ, కొండిభకొట, తమ్ముటు గ్రామంలో సిపిఎం ప్రతినిధి బృందం హైడ్రో పవర్ ప్రాజెక్టు ప్రభావిత అటవీ ప్రాంతంలోని గ్రామాల్లో పర్యటించి పరిశీలించారు. ఈ సందర్భంగా గిరిజనులు మాట్లాడుతూ, మూడు వారాల క్రితం సంబందిత అదికారులు ప్రాజెక్టుకు చెందిన సిబ్బందితో కలిసి డ్రోన్ లతో సర్వే నిర్వహించారన్నారు. అనంతరం సీపీఎం నేతల బృదం తో ఆయా గ్రామల గిరిజనులు గిరిజన ఆయుధాలు పటుకుని రేగులపాలేం గ్రామం నుండి ప్రోజెక్టు నిర్మాణం చేపటే గెడ్డ వరకు ర్యాలీ నిర్వహించి నిరసన చేపట్టారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా పలువురు నాయకులు, గిరిజనులు నినాదాలు చేశారు. అనంతరం సిపిఎం జిల్లా కార్యదర్శి పి.అప్పలనర్స మాట్లాడుతూ, ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి గిరిజనుల అభిప్రాయాన్ని గౌరవించి హైడ్రో పవర్ ప్రాజెక్ట్‌ను రద్దు చేస్తూ నర్సీపట్నంలో ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. గిరిజన హక్కులు, చట్టాలను ధిక్కరించి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మంజూరు చేసిన హైడ్రో పవర్ ప్రాజెక్ట్ లపై గిరిజనులు ఉద్యమం చేయాలన్నారు. హైడ్రో పవర్ ప్రాజెక్టులను కార్పొరేట్ సంస్థలైన అదానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుమతి మంజూరు చేయడం తమ రాజకీయ ప్రయోజనాల కోసమేనని మోడీ, జగన్ ప్రభుత్వం పై విమర్శించారు. సెల్‌ఫోన్ టవర్ ఏర్పాటు చేస్తామని మాయమాటలు గిరిజనులకు చెప్పి హైడ్రో పవర్ ప్రాజెక్ట్ నిర్మాణానికి డ్రోన్‌లతో సర్వే నిర్వహించడం మోసపూరితమన్నారు. వైసిపి నేతలు తమ వ్యక్తిగత రాజకీయ అవసరాలకు అనుగుణంగా గిరిజనులను వాడుకోవడం దారుణమన్నారు. అటవీ హక్కుల చట్టం, పీసా చట్టం, పంచాయతీ గ్రామ సభ ఆమోదం, గిరిజన సలహా మండలి తీర్మానం లేకుండా రాష్ట్ర ప్రభుత్వం ఏకపక్షంగా కార్పొరేట్ సంస్థలకు హైడ్రో పవర్ ప్రాజెక్టు కేటాయించడాన్ని వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. పోలవరం గిరిజన నిర్వాసితులను ఆదుకోలేని ప్రభుత్వాలు హైడ్రో పవర్ ప్రాజెక్ట్ బాధితులకు న్యాయం చేస్తాయా అని ప్రశ్నించారు.



గిరిజన ఆయుధాలతో నిరసన చేపడుతున్న అప్పలనర్స, గంగరాజు, దొన్నుదొర, గిరిజనులు



మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి అప్పలనర్స

ఉపాధి పేరుతో మాయమాటలు : గంగరాజు

జెడ్పీ టిసి దిసరి. గంగరాజు మాట్లాడుతూ అనంతగిరి మండలంలో 4800 మెగా వాట్స్ విద్యుత్ ఉత్పత్తి నిమిత్తం పెదకొట, గుజ్జెలి, చిట్టంపాడుతో పాటు చింతపల్లి మండలంలో ఎర్రవరంలో కూడా హైడ్రో పవర్ ప్రాజెక్ట్‌లను ఏర్పాటు చేయడంతో గిరిజనులను జల సమాధి చేయడమే అని విమర్శించారు. పోలవరం ప్రాజెక్టు నిర్వాసితులకు పరిహారం అందించలేని ప్రభుత్వం హైడ్రో పవర్ ప్రాజెక్ట్ బాధితులను ఆదుకుంటాయా అని ప్రశ్నించారు. ఉపాధి కల్పిస్తామని మాయమాటలు చెప్పడం దారుణమన్నారు. పెడకొట లో దొడ్డి దారిన సర్వే నిర్వహించి ప్రాజెక్ట్ నిర్మాణానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని నివేదికను రూపొందించారన్నారు. గుజ్జెలి, చిట్టెంపాడులో హైడ్రో పవర్ ప్రాజెక్ట్ నిర్మాణానికి అవసరమైన చర్యలు నిమిత్తం శాటిలైట్ సర్వే నిర్వహించారన్నారు. హైడ్రో పవర్ ప్రాజెక్టుపై సర్వే కొచ్చే వారిని అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. ఈ విషయమై జిల్లా పరిషత్, ఐటిడిఎ పాలక వర్గం లో ప్రస్తావిస్తాన్నారు.

టిడిపి రాష్ట్ర ఎస్టి సిఎల్ నాయకులు దొన్నుదొర మాట్లాడుతూ, గిరిజన హక్కులు, చట్టాలు ఉల్లంఘించి నరేంద్ర మోడి, జగన్మోహన్ రెడ్డి ఇద్దరూ కలిసి అధాని వంటి కార్పొరేట్ సంస్థలకు గిరిజనుల భూములు కట్టబెట్టడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు.దీనిపై పోరాటం చేస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో టోకూరు సర్పంచ్ కిల్లో మోస్య, సీపీఎం మండల కార్యదర్శి సోమెల నాగులు, గిరిజన సంఘం మండల అధ్యక్షులు సీవేరి కొండలరావు, పెదకోట మాజీ సర్పంచ్ జంపరంగి దేముడు, నారంగి సింహాచలం, జన్ని ఈశ్వరావు, జన్ని. వెంకటరావు, సోమేల దేముడు, సీదరి శంకరరావు, కోనేపు పావని, సివేరి లక్ష్మీ, మాదల ఈశ్వరమ్మ పాల్గొన్నారు.



పవర్ కెనాల్ మరమ్మతు పనులను పరిశీలిస్తున్న చీఫ్ ఇంజనీర్ శేషారెడ్డి తదితరులు

పంపు స్టోరేజ్ నిర్మాణానికి 90 శాతం అనుమతులు పూర్తి

ఎపి జెన్‌కో విద్యుత్ సౌద చీఫ్ ఇంజినీర్ శేషారెడ్డి

ప్రజాశక్తి -సీలేరు

సీలేరుకు సుమారు 2 కిలోమీటర్ల దూరంలోని పార్వతి నగర్ వద్ద 1350 మెగావాట్ల సామర్థ్యం గల పంపు స్టోరేజ్ ప్రాజెక్టు (ఎత్తిపోతల పథకం ప్రాజెక్టు) ప్రతిపాదించగా, దీని సంబంధించిన అనుమతులు 90శాతం పూర్తయినట్లు ఎపి జెన్‌కో విద్యుత్ సౌద చీఫ్ ఇంజనీర్ (సివిల్) శేషారెడ్డి వెల్లడించారు. స్థానిక విలేకరులతో బుధవారం ఆయన మాట్లాడుతూ ప్రాజెక్టుకు అవసరమైన స్థలానికి సంబంధించి ప్రజా అభిప్రాయ సేకరణ పూర్తయిందని, పర్యావరణ అనుమతులు రావలసిందని, వచ్చిన వెంటనే ప్రాజెక్టుకు సంబంధించిన టెండర్లు ప్రక్రియ పూర్తి చేస్తామని తెలిపారు. సీలేరు కాంప్లెక్స్ పరిధిలోని పొల్లూరు జల విద్యుత్ కేంద్రానికి సంబంధించిన 5, 6 యూనిట్లు నూతనంగా నెలకొల్పడానికి సంబంధించి విస్తరణ పనులకు ప్రజా అభిప్రాయ సేకరణ పూర్తయిందని, పర్యావరణ అనుమతులు కోసం ఆడిట్ నివేదికలు ఇవ్వవలసిందని చెప్పారు అలాగే ఐదు, ఆరు యూనిట్లు సంబంధించిన విస్తరణ గ్రౌండ్ లెవెల్ పనులు పూర్తయ్యాయని, యంత్ర సామాగ్రి తరలించే పనులు జరుగుతున్నాయని చెప్పారు. ఈ పనులు పర్యవేక్షణ నిమిత్తం వచ్చే అధికారుల కోసం కార్యాలయాలు క్వార్టర్స్ సిద్ధం చేశామన్నారు. ఈ కార్యక్రమంలో సీలేరు కాంప్లెక్స్ ఎస్ఈ సివిల్ కెకె.ప్రశాంత్ కుమార్ పాల్గొన్నారు.

డొంకరాయి జలాశయం నుంచి రబీకి నీరు విడుదల

సీలేరు కాంప్లెక్స్ పరిధి డొంకరాయి జలాశయం నుంచి గోదావరి డెల్టా రబీ పంటకు 2700 క్యూసెక్కులు నీటిని మంగళవారం నుంచి విడుదల చేస్తున్నట్లు ఏపీ జెన్కో విద్యుత్ సౌదా చీఫ్ ఇంజనీర్ శేషారెడ్డి వెల్లడించారు. ఇరిగేషన్ అధికారులు గోదావరి డెల్టా వరి నాట్లకు నీటిని విడుదల చేయాలని కోరడంతో ఈ మేరకు నీటిని విడుదల చేస్తున్నామని తెలిపారు. ప్రతి సంవత్సరం గోదావరి డెల్టాకు సీలేరు కాంప్లెక్స్ నుంచి విద్యుత్ ఉత్పత్తి అనంతరం 4 వేలు క్యూసెక్కులు, డొంకరాయి జలాశయం నుంచి 2700 క్యూసెక్కులు విడుదల చేసేవారుమని పేర్కొన్నారు. ప్రస్తుతం పవర్ కెనాల్ గండి కారణంగా కెనాల్ ద్వారా నీటిని విడుదల చేసే అవకాశం లేకపోవడంతో గోదావరి డెల్టాకు నీరు అత్యంత అవసరం ఉండడంతో నేరుగా డొంకరాయి జలాశయం గేట్లు ద్వారా నీటిని విడుదల చేయవలసిన పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. డొంకరాయి జలాశయం గేట్లు ద్వారా 2000 క్యూసెక్కులు ఏవీపీ డ్యాం ద్వారా 700 క్యూసెక్కులు నీటిని విడుదల చేస్తున్నామని పేర్కొన్నారు. ఈనెల 29 వరకు నీటి విడుదల చేస్తామన్నారు.

శరవేగంగా డొంకరాయి పవర్ కెనాల్ పనులు

డొంకరాయి పవర్ కెనాల్ గండి పూడ్చివేత పనులు శరవేగంగా జరుగుతున్నాయని, వచ్చే ఏడాది జనవరి 5 నాటికి పనులు చేస్తామని శేషారెడ్డి తెలిపారు. పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ ఇంజనీర్లు పర్యవేక్షణలో జరుగుతున్నాయన్నారు. కెనాల్ మరమ్మతు పనులు కోసం కోటి 70 లక్షల రూపాయలు వరకు అంచనా తయారు చేశామన్నారు.

గిరిజన గ్రామాల్లో అభివృద్ధి ఏదీ?

ప్రజాశక్తి-పెదబయలు:మండలంలో లింగేటి పంచాయతీలో మాజీ మంత్రి, టిడిపి అరకు నియోజక వర్గం ఇంఛార్జి కిడారీ శ్రావణ్ కుమార్, తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షురాలు సేకరీ సుకుమారిల అధ్వర్యంలో ఇదేం ఖర్మ కార్యక్రమం నిర్వహించారు. కిడారికి మహిళలు పూలమాలలు వేసి ఘన స్వాగతం పలికారు. అనంతరం మాజీ మంత్రి కిడారి శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ, గత తెలుగుదేశం పార్టీ హయాంలో మారుమూల గ్రామాల్లో రోడ్డు వేశామని, వైసిపి ప్రభుత్వం ఆ ఊసే ఎత్తలేదన్నారు. వైసిపి ప్రభుత్వం అధికారంలో వచ్చి మూడేళ్లు గడచినా గిరిజన గ్రామాలు ఎటువంటి అభివృద్ధికి నోచుకోలేదని విమర్శించారు. గ్రామాలలో కనీసం మౌలిక సదుపాయాలు కల్పించలేదన్నారు. గిరిజన హక్కుల కోసం జెఏసీ ఆధ్వర్యంలో ఈనెల30న పాడేరులో జరిగే ఆదివాసీ గర్జనకు సంపూర్ణ మద్దతు తెలుపుతున్నానని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ కార్యదర్శి వంతల ఆనందరావు సీనియర్ నాయకుల తైసభు త్రినాదు అరకు అసెంబ్లీ సెల్ ఉపాధ్యక్షుడు సల్లంగి రవికుమార్ మండల తెలుగు యువత అధ్యక్షుడు కొర్ర శేషు దారెల సర్పంచ్ పాంగీ, పాండురంగ స్వామి మహిళలు అధికసంఖ్యలో పాల్గొన్నారు.



నినాదాలు చేపడుతున్న టిడిపి నాయకులు

విద్యార్థి మణికంఠ ప్రతిభ

ప్రజాశక్తి -జి.మాడుగుల: కడప జిల్లా పొద్దుటూరు లో ఈనెల 22 నుండి 24 వరకు జరిగిన రాష్ట్ర స్థాయి షటిల్ బ్యాడ్మింటన్ పోటీలలో జి.మాడుగుల మండల కేంద్రంలో ఏపిఆర్ బాలుర కళాశాలలో ద్వితీయ సంవత్సరం చదువుతున్న రీమలి మణికంఠ ప్రథమ స్థానం సాధించాడు. ఈ విజయం పట్ల కళాశాల ప్రిన్సిపాల్ పారయ్య, వైస్ ప్రిన్సిపాల్ కృష్ణారావు, పిడి దొన్ను విద్యార్థులు, తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేశారు. మరింతగా రాణించాలని ఆకాంక్షించారు.



నినాదాలు చేపడుతున్న ప్రజా సంఘాల నేతలు

కళ్లకు గంతలు కట్టుకుని నిరసన

పదవ రోజు కొనసాగిన రిలే దీక్షలు

దీక్షలకు మద్దతు తెలిపిన నిరుద్యోగుల సంఘం

ప్రజాశక్తి-పాడేరు:పాడేరు ఐటిడిఎ పీవో గోపాల కృష్ణను తక్షణమే సరెండర్ చేయాలని, గిరిజన విద్యార్థుల మరణాలపై విచారణ చేపట్టాలని ఐటీడీఏ వద్ద చేపట్టిన నిరాహార దీక్షలు బుధవారం 10వ రోజు కొనసాగాయి. ప్రజా సంఘాల వేదిక నాయకులు కళ్లకు గంతలు కట్టుకొని వినూత్న రీతిలో నిరసన తెలిపారు ఈ సందర్భంగా నిరుద్యోగుల సంఘం అధ్యక్షులు కుమార్ మాట్లాడుతూ, విద్యార్థి, ప్రజా సంఘాలు నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలకు నిరుద్యోగుల సంఘం, భాష వాలంటీర్ల సంఘాల తరపున సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నామని తెలిపారు. ఐటీడీఏ గేటు ఎదుట 10 రోజులుగా రిలే నిరాహార దీక్షలు చేస్తున్న ప్పటికీ కనీసం ప్రభుత్వం స్పందించకపోవడం బాధాకరమన్నారు.గిరిజనులు, గిరిజన ఉద్యోగులు, గిరిజన ప్రజా ప్రతినిధులంటే గౌరవం లేని పాడేరు ఐటీడీఏ పిఓను తక్షణమే సరెండర్ చేయాలని డిమాండ్ చేశారు. పెదబయలు తహసీల్దార్ ఆత్మహత్యపై రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర విచారణకు ఆదేశించాలని, బాధ్యులు ఎంతటి వారైనా కఠినంగా చర్యలు తీసుకోవాలన్నారు. పీవోను రక్షించడం కోసం అమాయక ఉద్యోగులను బలి చేయడం సరికాదని, వారి సస్పెండ్‌ను తక్షణమే ఎత్తి వేయాలన్నారు.గిరిజన ప్రాంతంలో విద్యార్థుల వరస మరణాలపై హైకోర్టు సెట్టింగ్ జడ్జితో విచారణ నిర్వహించాలన్నారు. విద్యార్థుల తల్లితండ్రులు, విద్యార్థి, ప్రజా సంఘాలు, మీడియా ప్రతినిధులను గిరిజన విద్యా సంస్థల్లో ప్రవేశాన్ని నిరాకరిస్తూ గిరిజన సంక్షేమ ముఖ్య కార్యదర్శి జారీ చేసిన సర్క్యులర్ తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పిఓను సరెండర్ చేసేంత వరకు ఉద్యమం ఆపేది లేదని, ప్రభుత్వం స్పందించకపోతే ఉద్యమం మరింత తీవ్రతరం చేస్తామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల వేదిక కన్వీనర్ కూడ రాధాకృష్ణ. కో కన్వీనర్లు మువ్వాళ లక్ష్మణరావు, చిన్నారావు, కాదేలి చంటిబాబు, బత్తిరి నరేష్, భాష వాలంటీర్ల సంఘం సభ్యులు కె.క్రిష్ణ, కె.లచ్చన్న, జి. మత్యరాజు, సీదేరి జ్యోతి, పూజారి కృష్ణకుమారి తదితరులు పాల్గొన్నారు.

మహిళలపై అఘాయిత్యాలు అరికట్టాలి

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు:మహిళలపై జరుగుతున్న ఆఘాయిత్యాలు, దాడులు అరికట్టాలని గిరిజన మహిళా సంఘం (ఐద్వా) అధ్యక్షురాలు విజయలక్ష్మి డిమాండ్ చేశారు. మహిళలపై జరుగుతున్న దాడులపై న్యాయ పోరాటానికి సిద్ధంగా ఉంటుందని తెలిపారు. మహిళలు అధైర్య పడవద్దని, మనోధైర్యం పెంచుకొని అన్ని రంగాల్లో మహిళలు ముందడుగులో ఉండాలని సూచించారు. ప్రపంచంలో జరుగుతున్న అఘాయిత్యాలను చూసి భయ పడవద్దని తెలిపారు. గిరిజన సంఘం మండల కమిటీ సభ్యురాలు సోనియా ఈశ్వరి మాట్లాడుతూ, గిరిజన మహిళలు ధైర్యంగా ఉండాలన్నారు. చేతి క్యాలెండర్లను అంగన్వాడి సిబ్బంది, కార్యకర్తలకు అందజేశారు.



చేతి క్యాలండర్లను చూపుతున్న అంగన్‌వాడీలు

అధికారిక కార్యక్రమాల వేదికపైకి

ఏ హోదాలో ఆహ్వానించారు

గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి పులి సంతోష్‌కుమార్

ప్రజాశక్తి- విఆర్.పురం

అధికారికంగా జరిగే కార్యక్రమాల వేదికలపై వైసిపి నాయకులను ఏ హోదాలో ఆహ్వానించారని సర్పంచ్, గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి పులి సంతోష్‌కుమార్ ప్రశ్నించారు. బుధవారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ బుధవారం స్థానిక ప్రభుత్వ హైస్కూల్లో విద్యార్థులకు బుధవారం ట్యాబ్‌లు పంపిణీ చేసే కార్యక్రమంలో వేదికపై ప్రజాప్రతినిధులు, అధికారులతో పాటుగా రాజకీయ నాయకులను కూడా ఆహ్వానించారని, అంతేకాకుండా ప్రజాప్రతినిధులు మాట్లాడకుండానే వైసిపి నాయకులను చేత మాట్లాడించారని మండిపడ్డారు. ఏ ప్రోటోకాల్ ప్రకారంగా వేదిక మీద పిలిచారని ప్రశ్నించారు. శ్రీరామగిరి గ్రామపంచాయతీలోని చొక్కానపల్లి గ్రామంలోని వైసిపి జెండా దిమ్మ నిర్మించే దాంట్లో ఏకంగా ఒక వాలంటీర్ దగ్గరుండి ఇసుక తెచ్చి, ఇటుకలు తెప్పించి నిర్మించే దాంట్లో పాత్ర వహించటం తెలిపారు. వాలంటీర్ వ్యవస్థ ప్రజలకు సేవ చేయడానికి ఉన్నదా? వైసిపి కార్యక్రమాలను విజయవంతం చేయడం కోసం పనిచేస్తుందా? అధికారులు చెప్పాలని డిమాండ్ చేశారు. నిబంధనలు పాటించకుండా అధికారులు ప్రజా ప్రతినిధులు ఉన్న వేదికపైకి రాజకీయ నాయకులను ఆహ్వానించిన వారిపై తక్షణమే పైఅధికారులు చర్య తీసుకోవాలని, వైసిపి కార్యక్రమాల్లో పాల్గొంటున్న వాటంటీర్లను తక్షణమే విధుల నుంచి తొలగించాలని కోరారు.

ఆధార్ అప్‌డేట్ చేయించుకోవాలి

ఐటిడిఎ పిఒ సూరజ్ గనోరే

ప్రజాశక్తి - రంపచోడవరం

2010 నుండి 2016 మధ్య ఆధార్ కార్డులు పొందినవారు వాటిని మళ్లీ అప్‌డేట్ చేయించుకోవాలని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సూరజ్ గనోరే పేర్కొన్నారు. బుధవారం తన ఛాంబర్లో ఆధార్ కార్డుల నవీకరణకు సంబంధించిన ప్రచార పోస్టర్‌ను పిఒ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు సంబంధించిన పథకాలకు, బ్యాంకు సేవలకు తప్పనిసరిగా ఆధార్ ఉండాలన్నారు. ప్రస్తుతం ఏజెన్సీలో 5 మొబైల్ ఆధార్ కేంద్రాలు, ఐటిడిఎ కార్యాలయంలో ఒక్కటి పని చేస్తున్నాయని చెప్పారు. ఈ కార్యక్రమం ఆధార్ బ్లూ ప్రీ ఐటి కో-ఆర్డినేటర్ డేవిడ్ పాల్గొన్నారు.



ప్రచార పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఐటిడిఎ పిఒ సూరజ్ గనోరే

పోలీసుల వాహన తనిఖీలు

ప్రజాశక్తి-రాజవొమ్మంగి

వాహనదారులు తప్పనిసరిగా తమ వాహనాలకు సంబంధించిన రికార్డులు కలిగి ఉండాలని జడ్డంగి ఎస్ఐ షరీఫ్ అన్నారు. బుధవారం మండలంలోని జడ్డంగి శివారులో పోలీసులు వాహన తనిఖీలు చేపట్టారు. ఏలేశ్వరం-రాజవొమ్మంగి ప్రధాన రహదారి మీదుగా వచ్చిపోయే ప్రతి వాహనాన్ని ఆపి రికార్డులు నిశితంగా పరిశీలించారు. రికార్డు సక్రంగా లేని పలు వాహనదారుల నుండి అపరాధ రుసుము వసూలు చేశారు. వాహనదారులకు ఎస్ఐ షరీఫ్ పలు సూచనలు చేశారు. వాహనాల్లో గంజాయి, నాటసారా వంటి అక్రమ రవాణాలకు పాల్పడకూడదని సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, ఏపీఎస్పీ బెటాలియన్ పాల్గొన్నారు.



వాహనాలను తనిఖీ చేస్తున్న ఎస్ఐ షరీఫ్, పోలీసులు

సిసి రోడ్డు నిర్మాణ పనుల ప్రారంభం

ప్రజాశక్తి - రంపచోడవరం

మండలంలో ఫోక్స్‌పేటలో సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులను సర్పంచ్ పండా లక్ష్మి, వైస్ ఎంపీపీ పండా కుమారి బుధవారం ప్రారంభించారు. ముందుగా గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్లు కారు నర్యయమ్మ, కురసం కృష్ణవేణి, పొడియం రాజన్న దొర, బల్లెం సూర్యకుమారి, వైసీపీ నాయకులు పండా నాగన్న దొర పాల్గొన్నారు.



సిసి రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న సర్పంచ్, వైస్ ఎంపిపి

గిరి విజ్ఞాన సంబరాలు ప్రారంభం



గిరి విజ్ఞాన సంబరాలను ప్రారంభిస్తున్న గిరిజన సంక్షేమ ముఖ్య కార్యదర్శి కాంతిలాల్ దండే

ప్రజాశక్తి-పాడేరు టౌన్, అల్లూరి సీతారామరాజు జిల్లా

అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు పరిధి తలారిసింగి జిటిడబ్ల్యూ ఆశ్రమ పాఠశాలలో ఐటిడిఎ స్థాయి గిరి విజ్ఞాన సంబరాలను గిరిజన సంక్షేమ ముఖ్య కార్యదర్శి కాంతిలాల్ దండే బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గిరిజన విద్యార్థుల్లో విజ్ఞానానికి, ప్రతిభకు కొదవలేదన్నారు. వారికి క్రమ శిక్షణ, విలువలతో కూడిన విద్యను అందించాలన్నారు. గతేడాది గిరి విజ్ఞాన సంబరాల నిర్వహణపై మంచి ప్రతిస్పందన వచ్చిందని చెప్పారు. గిరి విజ్ఞాన సంబరాలు రాష్ట్ర స్థాయిలో నిర్వహించడానికి కృషి చేస్తానన్నారు.

ఐటిడిఎ పిఒ రోణంకి గోపాలకృష్ణ మాట్లాడుతూ, ఉపాధ్యాయులు విద్యార్థుల మధ్య జ్ఞాన పంపిణీ అనే అంశంతో గిరి విజ్ఞాన సంబరాలు -2022 నిర్వహిస్తున్నామన్నారు. డిసెంబరు 5న స్కూల్ కాంప్లెక్స్ స్థాయిలోను, 22న జోనల్ స్థాయిలోను గిరి విజ్ఞాన సంబరాలు నిర్వహించామని చెప్పారు. 28 నుంచి 30వ తేదీ వరకు ఐటిడిఎ స్థాయిలో ఈ విజ్ఞాన సంబరాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 11 వందల మంది విద్యార్థులు 577 ప్రాజెక్టులను ప్రదర్శిస్తున్నారని చెప్పారు. ఏడు రకాల క్రీడలను నిర్వహిస్తున్నామని, 1800 మంది విద్యార్థులు పాల్గొంటున్నారని తెలిపారు. తెలుగు, ఆంగ్లం, లెక్కలు, భౌతిక, జీవ, సాంఘిక శాస్త్రాలలో విజ్ఞాన ప్రదర్శనలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. గుత్తులపుట్టు, శ్రీకృష్ణాపురం పాఠశాలల బాలికల నృత్య ప్రదర్శనలు, కొయ్యూరు విద్యార్థుల మలకంబ ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ జె.శివశ్రీనివాసు, సబ్ కలెక్టర్ వి.అభిషేక్, డిఇఒ డాక్టర్ పి.రమేష్, టిడబ్ల్యూ డీడీ ఐ.కొండలరావు, వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



క్రీడా ప్రదర్శనలో గిరిజన విద్యార్థులు



గ్రామ సభలో అడుగుతున్న సర్పంచ్

పించన్ల తొలగింపు దుర్మార్గం

గ్రామ సభలో నిలదీసిన సర్పంచ్ సూరిబాబు

పంచాయతీలో 19 పించన్లను తొలగింపుపై ప్రశ్న

ప్రజాశక్తి-జి.మాడుగుల: పించన్లను నిలిపివేయడం దుర్మార్గమని, దీంతో వికలాంగులు, వృద్ధులు, వితంతువులు ఇబ్బందులకు గురవుతున్నారని నుర్మతి సర్పంచ్ సూరిబాబు ఆవేదన వ్యక్తం చేశారు. నుర్మతి సచివాలయంలో బుధవారం గ్రామ సభను నిర్వహించారు. పంచాయతీలో 19 పించన్లను నిలిపి వేయడం ఏమిటని ప్రశ్నించారు. ఈ విధంగా మండలంలో చాలామంది వృద్ధులు, వికలాంగులు, వితంతువులకు పించన్లు ప్రభుత్వం నిలిపి వేసిందన్నారు. నిలిపి వేసిన పించన్లను వెంటనే పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. పంచాయతీలో మారుమూల గ్రామాలకు రహదారులు, తాగునీటి సౌకర్యం కల్పించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ సెక్రెటరీ సతీష్, వైస్ సర్పంచు లక్ష్మి, టిడిపి యూనిట్ ఇన్చార్జి వెంకట్, టిడిపి పంచాయతీ అధ్యక్షులు చిరంజీవి, వార్డు సభ్యులు, సచివాలయ సిబ్బంది, గ్రామ వాలంటీర్లు పాల్గొన్నారు.



ఫిర్యాదు చేస్తున్న సిపిఎం నేతలు

అక్రమ కట్టడాలపై సిపిఎం ఫిర్యాదు

ప్రజాశక్తి -అరకులోయ రూరల్: మండల కేంద్రంలోని పశుసంవర్ధక శాఖ కార్యాలయం ఎదురుగా ప్రధాన రహదారికి ఆనుకొని ఆర్అండ్‌బి స్థలంలో నిర్మిస్తున్న అక్రమ కట్టడాలను నిలుపుదల చేయాలని సీపీఎం మండల కార్యదర్శి కిండంగి రామారావు, అరకులోయ టౌన్ ఎంపిటిసి దురియా ఆనంద్ కుమార్, గిరిజన సంఘం మండల కార్యదర్శి పి.రామన్న పాడేరు సబ్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు నాయకులు విలేకర్లతో మాట్లాడుతూ, అరకులోయ మండలంలోని మంగళవారం పర్యటించిన సబ్ కలెక్టర్‌కు అక్రమ కట్టడాలపై వివరించామన్నారు. కట్టడాలపై తహశీల్దర్ కు కుడా ఫిర్యాదు చేసినా స్పందించ లేదన్నారు. బహిరంగంగా అక్రమ కట్టడాల నిర్మాణం చేపడుతున్నా రెవెన్యూ అధికారులు పట్టించుకోక పోవడం దారుణమన్నారు. పంచాయతీ షాపింగ్ కాంప్లెక్స్ నిర్మిస్తే ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రత్యేక ప్రకటన ఇవ్వాల్సి ఉందన్నారు. ఎటువంటి ప్రకటనలు ప్రకటించకుండా రహస్యంగా నిర్మాణాలు చేపట్టడంపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయని తెలిపారు. దీనిపై స్పందించిన సబ్ కలెక్టర్ అభిషేక్ తక్షణమే అక్రమ కట్టడాలు నిలుపుదల చేయాలని తహసిల్దార్ వేణుగోపాల్‌కు ఆదేశించారని నాయకులు తెలిపారు.

పించన్లు పునరుద్ధరించాలి

గిరిజన సంఘం, సిపిఎం వినతి

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు: మండలంలో వృద్ధాప్య, వితంతు పించన్లు వివిధ కారణాలతో తొలగించడం అన్యాయమని గిరిజన సంఘం మండల కార్యదర్శి ఎం ఎం శ్రీను తెలిపారు. తొలగించిన పించన్లను పునరుద్ధరణ చేయాలని ఎంపీడీవో కిరణ్ కుమార్‌కు వినతి పత్రాన్ని ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం కాకమ్మ కథలు చెబుతూ పేద, నిరుపేదలకు, వయోవృద్ధులు, వితంతులకు ఆర్థిక సహాయంగా అందజేస్తున్న పించన్లు రద్దు చేయడంపై మండిపడ్డారు. 300ల యూనిట్లు విద్యుత్ వినియోగం, 10 ఎకరాల భూమి తదితర కారణాలు చూపి పించన్లు రద్దు చేయడం సరికాదన్నారు. ఉన్నత అధికారులకు నివేదికలు పంపించి ఆగిన పించన్లు తక్షణమే పునరుద్ధరణ చేసేలా కృషి చేస్తానని ఎంపిడిఒ హామి ఇచ్చారని నాయకులు తెలిపారు. విద్యుత్ బిల్లులు ఎందుచేత అధికంగా వస్తున్నాయో సంబంధిత విద్యుత్ శాఖ అధికారులతో చర్చలు జరుపుతామన్నారు. ఈ కార్యక్రమంలో నారాయణ, పాంగి భీమరాజు, కొర్ర శంకరరావు పాల్గొన్నారు.

డుంబ్రిగూడ: వివిధ చిన్న చిన్న కారణాలతో తొలగించిన వృద్ధాప్య, వితంతు, వికలాంగుల పించన్లను వెంటనే పునరుద్ధరించాలని స్థానిక సిపిఎం మండల ప్రధాన కార్యదర్శి ఎస్‌బి పోతరాజు డిమాండ్ చేశారు. బుధవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, విద్యుత్ బిల్లులు 300 యూనిట్లు, మూడు ఎకరాల భూములు కలిగి ఉండడం వటి పాటు కారణాలను చూపి పించన్లను ప్రభుత్వం అన్యాయంగా తొలగించిందన్నారు. పించన్లను పెంచుతున్నామని ఒకపక్క ప్రచారం చేయడంతో పాటు మరోపక్క వివిధ కారణాలను చూపి అక్రమంగా తొలగిస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వం అందించే పించన్ల పైనే ఆధారపడి జీవిస్తున్న వారికి తొలగించడంతో పరిస్థితి మరింత దైన్యంగా మారే అవకాశం ఉంటుందని చెప్పారు. తక్షణమే తొలగించిన పించన్లను పునరుద్ధరించాలని, లేనిపక్షంలో ఆందోళన చేపడుతామని ఆయన హెచ్చరించారు.



ముంచంగిపుట్టులో వినతిపత్రం ఇస్తున్న నాయకులు

288 మంది పించనుదారులకు నోటీసులు

ప్రజాశక్తి-జి.మాడుగుల: మండలంలోని 17 పంచాయతీల్లో 288 మంది పించను లబ్ధిదారులకు నోటీసులను జారీ చేసినట్టు ఎంపీడీవో లోహిత్ జయ సాగర్ తెలిపారు. పెన్షన్ లబ్ధిదారులు ఎవరు ఆందోళన పడొద్దని నోటీసులు జారీ చేసినంత మాత్రాన పెన్షన్ తీసి వేయమన్నారు. సచివాలయ సిబ్బంది ఆధారాలు పరిశీలిస్తారన్నారు.

కమాండ్ కంట్రోల్ రూం ప్రారంభం

ప్రజాశక్తి-పాడేరు టౌన్: ఐటిడిఎలో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ రూంను గిరిజన సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి కాంతిలాల్ దండే, జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ముఖ్య కార్యదర్శి కాంతిలాల్ దండే , జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, ఐటిడిఎ పిఒ రోణంకి గోపాలక్రిష్ణ స్థానిక గురుకులం బాలికల కళాశాల, జి.మాడుగుల గురుకులం బాలుర కళాశాల విద్యార్థినీ, విద్యార్థులతో పర్చువల్ విధానంలో మాట్లాడారు. కళశాలలో మెనూ, వసతి సౌకర్యాలపై ఆరా తీసారు. భోజనాలు ఎలా ఉన్నాయి ? ఫిర్యాదుల పెట్టె ఉందా ? ఆరోగ్య సమస్యలపై ఆరా తీసారు. బాలికల గురుకులం కళాశాలలో తాగునీటి సమస్యకు జిల్లా కలెక్టర్ నిధులు మంజూరు చేసారని, ప్రహరీ గోడ నిర్మాణానికి ఐటిడి ఏ పిఒ నిధులు మంజూరు. చేసారని విద్యార్థులు వివరించారు. సచివాలయం మహిళా పోలీసులు వస్తున్నారా ? ఎఎన్ఎంలు వస్తున్నారా? ఎటువంటి వైద్య పరీక్షలు చేస్తున్నారని ప్రశ్నించి విద్యార్థులను ఆడిగి తెలుకున్నారు. ఈ కార్యక్రమంలో జెసి జె.శివ శ్రీనివాసు, సబ్ కలెక్టర్ వి.అభిషేక్, టిడబ్ల్యూ డిడి ఐ.కొండలరావు, ఐటిడిఎ ఎపిఒ విఎస్ ప్రభాకరరావు, టిడబ్ల్యూ ఇఇ డివిఆర్ఎం రాజు, తదితరులు పాల్గొన్నారు.

కెజిహెచ్‌కు ఐఎస్ఒ 9001-2015

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ : ఉత్తరాంధ్ర జిల్లాల ఆరోగ్య ప్రధాయినిగా గుర్తింపు పొందిన కెజిహెచ్‌కు ఐఎస్ఒ ధ్రువీకరణ పత్రం లభించింది. ఈ ధ్రువపత్రాన్ని కెజిహెచ్ డాక్టర్ మైథిలికి గురువారం హెచ్‌వైఎం ఇంటర్నేషనల్ సర్టిఫికెషన్ ప్రయివేటు లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ ఆలపాటి శివయ్య, ఎఎంసి ప్రిన్సిపల్ డాక్టర్ బుచ్చిరాజు అందజేశారు. జనరల్ మెడిసిన్ విభాగానికి ప్రత్యేకంగా హైజిన్ ప్రాక్టీస్ ఐఎస్ఒ ధ్రువీకరణ పత్రాన్ని ఆ విభాగం హెచ్ఒడి డాక్టర్ సుందర్ రాజుకు అందజేశారు. హెచ్‌వైఎం ఇంటర్నేషనల్ సర్టిఫికేషన్ ప్రైవేట్ లిమిటెడ్ వారు ఇటీవల ఎటువంటి ముందస్తు సమాచారం లేకుండా కెజిహెచ్‌లో అన్ని విభాగాలను సందర్శించి ఆడిట్ నిర్వహించారు. ఈ సంస్థ క్వాలిటీ ఎసూరెన్స్, క్వాలిటీ మేనేజ్మెంట్ అంశాలపై ప్రత్యేక ఆడిట్ నిర్వహించింది. ఆయా విభాగాలు రికార్డుల నిర్వహణ, సైన్ బోర్డ్స్, వార్డులలో వైద్య సిబ్బంది జవాబుదారీతనం, ఐసియులో డాక్టర్లు, నర్సింగ్ సిబ్బంది, చికిత్సకు సంబంధించి అనుసరిస్తున్న వివిధ అంశాలను తనిఖీచేశారు. వీటన్నింటినీ సక్రమంగా నిర్వహిస్తున్నట్లు తెలుసుకొని 9001-2015 ఐఎస్ఒ ధ్రువీకరణ పత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో కెజిహెచ్ ఎడి చిట్టూరి శ్రీనివాసకుమార్, సిఎస్ ఆర్ఎమ్ఒ డాక్టర్ వాసుదేవ్ పాల్గొన్నారు.

సమాజ హిత పరిశోధనలకు ప్రోత్సాహం



యానిమల్ హౌస్ ప్రారంభోత్సవంలో గీతం అధ్యక్షుడు శ్రీభరత్

ప్రజాశక్తి -మధురవాడ : బోధనతో పాటు శాస్త్ర పరిశోధనలకు గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం అధిక ప్రాధాన్యతనిస్తుందని,సమాజహిత పరిశోధనలను ప్రోత్సహించాలన్నదే లక్ష్యమని గీతం అధ్యక్షుడు ఎం.శ్రీభరత్ అన్నారు. పరిశోధనా ఫలితాల అధ్యయనానికి విశ్వవిద్యాలయంలో నూతనంగా ఏర్పాటు చేసిన యానిమల్ హౌస్‌ను బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా గీతం వర్సిటీ విసి దయానంద సిద్దవటం మాట్లాడుతూ ఎథిక్స్ కమిటీ పర్యవేక్షణలో గీతం యానిమల్ హౌస్‌లో అధ్యయనాలు నిర్వహిస్తామన్నారు. శాస్త్రపరిశోధనల ప్రోత్సాహానికి గీతంలో ప్రయోగశాలలను రూ.50 కోట్లతో ఆధునికీకరిస్తున్నామన్నారు. బయోనెస్ట్, అటల్ లాబ్‌ల ఏర్పాటుకు ప్రణాళికాయుతంగా ముందుకెళ్తున్నామన్నారు. . పరిశోధనలతో బోధన స్థాయి పెరుగుతుందని అభిప్రాయపడ్డారు. పేటెంట్లకు గీతం ప్రాధాన్యత ఇస్తుందన్నారు. కార్యక్రమంలో గీతం ఉపాధ్యక్షుడు ప్రొఫెసర్ ఎమ్. గంగాధరరావు, గీతం ప్రోవిసిలు ప్రొఫెసర్ జయశంకర్ వారియర్, వై. గౌతమ్‌రావు, జిమ్‌సర్ ప్రోవిసి డాక్టర్ బి.గీతాంజలి, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డి.గుణశేఖరన్, ఫార్మశీ డీన్, ప్రిన్సిపాల్ పి. రామారావు, జిమ్‌సర్ ప్రిన్సిపల్ డాక్టర్ బి.జ్యోతిపద్మజ, ఫార్మశీ కళాశాల అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆదర్శనీయుడు ద్రోణంరాజు

ప్రజాశక్తి- సీతమ్మధార: రాజకీయ విలువలకు చిరునామాగా ఉన్న ద్రోణంరాజు సత్యనారాయణ, కొత్తగా రాజకీయాల్లోకి వచ్చేవారికి ఆదర్శనీయుడని ఉత్తర నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త, నెడ్‌క్యాప్ చైర్మన్ కెకె.రాజు అన్నారు. బుధవారం బాలయ్య శాస్త్రి లేఅవుట్ సింధూర ఫంక్షన్ హాల్‌లో మాజీ డిప్యూటీ మేయర్ దాడి సత్యనారాయణ ఆధ్వర్యంలో ద్రోణంరాజు 17వ వర్ధంతి నిర్వహించారు. కెకె.రాజుతోపాటు వుడా మాజీ చైర్మన్ రవి, ద్రోణంరాజు శ్రీవత్స, పత్రికా సంపాదకులు వివి రమణమూర్తి తదితరులు ద్రోణంరాజు సత్యనారాయణ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులు అర్పించిచారు. మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఉత్తరాంధ్ర అభివృద్ధికి ద్రోణంరాజు చేసిన సేవలను కొనియాడారు.కార్యక్రమంలో కో ఆప్షన్ సభ్యులు సేనాపతి అప్పారావు, సీనియర్ నాయకులు పేడాడ రమణకుమారి, జబర్దస్త్ అప్పారావు పాల్గొన్నారు.

అపోలోలో అరుదైన ఆర్థో ఆపరేషన్

ప్రజాశక్తి - ఆరిలోవ : అపోలో ఆసుపత్రిలో సీనియర్ ఆర్థోపెడిక్ సర్జన్, హెచ్ఒడి డాక్టర్ అబ్దుల్ డి ఖాన్ ఆధ్వర్యంలో అరుదైన శస్త్ర చికిత్సను విజయవంతంగా నిర్వహించారు. 21 ఏళ్ళ మహిళ ఆరు నెలలుగా కుడి చీల మడమ వాపు, నొప్పితో బాధపడుతున్న నేపథ్యంలో అపోలో వైద్యులను సంప్రదించగా, ఎంఆర్ఐ స్కాన్ ద్వారా సబ్‌టాలార్ జాయింట్ నుండి ఉత్పన్నమయ్యే గ్యాంగ్లియన్ తిత్తి ఉందని గమనించారు. డాక్టర్ ఖాన్ పాద వెనుక నుంచి ఎండోస్కోపి ద్వారా శస్త్రచికిత్స చేసి గ్యాంగ్లియన్ తిత్తిని తొలగించారు. ఆపరేషన్ చేసిన రోజునే రోగిని డిశ్చార్జి చేశారు. పాదం వెనుక భాగంలో ఎండోస్కోపీ ద్వారా శస్త్రచికిత్స చేయడం రాష్ట్రంలో ఇదే తొలిసారని అపోలో వైద్యులు పేర్కొన్నారు.



ఎండోస్కోపి ద్వారా పాదం వెనుక భాగంలో శస్త్ర చికిత్స

ట్యాబ్‌లు సరే... టీచర్లు ఏరీ..?

ఎమ్మెల్యే ధనలక్ష్మిని ప్రశ్నించిన ఎంపిటిసి, సర్పంచ్

ప్రజాశక్తి-విఆర్.పురం : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి విద్యార్థులకు రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి బుధవారం ట్యాబ్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బైజూస్ ద్వారా విద్యా బోధనకు ఈ ట్యాబ్‌లు పంపిణీ చేసినట్లు చెప్పారు. ఎంపిటిసి పూనెం ప్రదీప్ కుమార్, సర్పంచ్ పులి సంతోష్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థులకు ట్యాబ్‌లు పంపిణీ చేస్తే సరిపోదని, అనేక పాఠశాలల్లో చదువులు చెప్పే గురువులు లేరని, ఉపాధ్యాయులు నియామకాలు చేపట్టాలని కోరారు. పాఠశాలలో మౌలిక సౌకర్యాలు కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి కారం లక్ష్మి, ఎస్టి కమిషన్ సభ్యులు చిచ్చడి మురళి, రేకపల్లి ఎంపీటీసీ బంధం విజయలక్ష్మి, సర్పంచ్‌లు కారం బుజ్జమ్మ, సోడి నర్సమ్మ, వైస్ ఎంపీపీలు ముత్యాల భవాని, వడ్డాపు శారద పిట్టా రామారావు, శ్రీరామగిరి దేవాలయ చైర్మన్ రేవు బాలరాజు, వైసిపి నాయకులు బొడ్డు సత్యనారాయణ, ఉదయం గోపాల్, ముత్యాల శ్రీనివాస్, మాచర్ల గంగయ్య, రామలింగారెడ్డి, మామిడి వెంకటరమణ, ముత్యాల మురళి, తహశీల్దారు ఎన్.శ్రీధర్, ఎంపీడీవో ఆర్.ఫణీంద్ర, ఎంఇఒ వివి లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.



ట్యాబ్‌లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ధనలక్ష్మి

అత్యవసర సన్నద్ధతపై స్టీల్‌ప్లాంట్‌లో మాక్ డ్రిల్

1**ప్రజాశక్తి-ఉక్కునగరం :** జాయింట్ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ శివశంకర్ రెడ్డి పర్యవేక్షణలో స్టీల్‌ప్లాంట్‌లో ప్లాంట్ లెవెల్ మాక్‌డ్రిల్ బుధవారం నిర్వహించారు. స్టీల్‌ప్లాంట్‌లోని ఎనర్జీ మేనేజ్‌మెంట్ డిపార్ట్‌మెంట్. గ్యాస్ మిక్సింగ్ స్టేషన్‌లో కల్పిత గ్యాస్ లీక్ చేసి, అనంతరం ఆన్ సైడ్ ఎమర్జెన్సీ ప్రిపేర్ చేయడానికి ఈ డ్రిల్ ఏర్పాటు చేశారు. మాక్ డ్రిల్‌లో వైద్య సేవలు, గ్యాస్ భద్రత వంటి అత్యవసర సేవా విభాగాలు, సేఫ్టీ డిపార్ట్మెంట్ ఎన్విరాన్మెంట్ మేనేజ్‌మెంట్, డిపార్ట్‌మెంట్ సిఐఎస్ఎఫ్, సెక్యూరిటీ హెచ్ఆర్ డిపార్ట్‌మెంట్ పాల్గొన్నాయి. గ్యాస్ సేఫ్టీ టీం వెంటనే గ్యాస్ మానిటర్లు, ఆర్టిఫిషియల్ రెస్పిరేటర్లతో ఘటన స్థలానికి చేరుకొని పేలుడు పదార్థాల సాంద్రతను విశ్లేషించారు. రెస్క్యూ టీం వచ్చేవరకు బాధితులకు ఆక్సిజన్ అందించారు. టీఐఎస్ఎఫ్ భద్రత సిబ్బంది రిసక్యూ ఆపరేషన్లు చేపట్టాయి. సెల్ఫ్ కంటెంట్ బ్రీతింగ్ ఆపరేటర్స్ ఇతర అత్యవసర ప్రతిస్పందన పరికరాలను ఉపయోగించి బాధిత వ్యక్తులను రక్షించడానికి స్పాట్ నుంచి తరలింపు వంటి అనే ప్రక్రియలను మాక్ డ్రిల్‌లో చేశారు. స్టీల్ ప్లాంట్ బృందం కృషిని . శివశంకర్ రెడ్డి ప్రశంసించారు. కార్మికుల భద్రత కోసం మరిన్ని సూచనలు చేశారు. స్టీల్‌ప్లాంట్ చీఫ్ జనరల్ మేనేజర్ ఎంవిఎస్ కష్ణయ్య మార్గదర్శకంలో ఈ ప్లాంట్ లెవెల్ మాక్ డ్రిల్ నిర్వహించారు. కార్యక్రమంలో స్టీల్‌ప్లాంట్ సీనియర్ అధికారులు కె.సుధాకర్, ఎంకె. రావు ఉత్తమ్ బ్రహ్మ పాల్గొన్నారు.



మాక్‌డ్రిల్‌లో పాల్గొన్న సిఐఎస్ఎఫ్



మాక్ డ్రిల్ పర్యవేక్షిస్తున్న శివశంకర్

గ్రామ పంచాయతీ సర్పంచుల సంఘం

రాష్ట్ర కార్యదర్శిగా వెంకటలక్ష్మి

ప్రజాశక్తి -పద్మనాభం: రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం కార్యదర్శిగా పద్మనాభం మండలం, అనంతవరం గ్రామ సర్పంచ్ గొర్రిపాటి వెంకటలక్ష్మి ఎంపిక చేసినట్లు. ఆంధ్రప్రదేశ్ సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులు ఎలమంచిలి బాబూరాజేంద్రప్రసాద్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు, ఈ సందర్భంగా వెంకటలక్ష్మికి ఎంపిపి రాంబాబు, వైసిపి మండల అధ్యక్షులు కె.లక్ష్మణ, ఇయర్ల ఈశ్వరరావు, పలువురు నేతలు, అనంతవరం గ్రామస్తులు అభినందనలు తెలిపారు.



రాజేంద్రప్రసాద్ నుంచి నియామక పత్రం అందుకుంటున్న వెంకటలక్ష్మి

అటవీ అధికారుల అరాచకాలు ఆపాలని ధర్నా

ప్రజాశక్తి-చింతూరు

అటవీ శాఖ అధికారుల అరాచకాలు ఆపాలని, కూనవరం రేంజర్ మోహిని విజయలక్ష్మి సస్పెండ్ చేసి న్యాయ విచారణ జరపాలని డిమాండ్ చేస్తూ బుధవారం ఐటీడీఏ కార్యాలయం వద్ద బిజెపి ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. తొలుత ఆర్టీసీ బస్టాండ్ నుండి ఐటీడీఏ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఐటీడీఏ పీవో ఫర్మాన్ అహ్మద్ ఖాన్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా బిజెపి నాయకులు మాట్లాడుతూ రేంజర్ మోహిని విజయలక్ష్మి కింది స్థాయి ఉద్యోగుల పట్ల వేధింపులకు పాల్పడుతున్నట్లు తెలిసిందని, బంధువులకు అక్రమ కలప అందజేస్తుందని, ఆదివాసీలపై అక్రమ కేసులు బనాయిస్తున్నారని, వీటిపై సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బిజెపి నాయకులు వెంకయ్య, రమణారెడ్డి. కారం దారయ్య రత్తయ్య పాల్గొన్నారు.

ఆదివాసీ గర్జనను విజయవంతం చేయండి

ప్రజాశక్తి -సీలేరు

పాడేరులో ఈ నెల 30న జరగనున్న ఆదివాసీ గర్జనను విజయవంతం చేయాలని ఆదివాసీ జేఏసీ నాయకులు మట్టడం రాజాబాబు పిలుపునిచ్చారు. స్థానిక విలేకరులతో బుధవారం ఆయన మాట్లాడుతూ బోయ వాల్మీకిలను గిరిజన జాబితాలో చేర్చొద్దని, జీవో నెంబర్ 52ను, శామ్యూల్ ఆనంద కమిషనర్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు నూతన రామకృష్ణ, కొర్ర మల్లేశ్వరరావు, కొండకించింగి పుష్పరాజు, సిహెచ్ వెంకటేష్, ఎస్.ప్రసాద్, జె.కామేశ్వరరావు పాల్గొన్నారు.

31లోగా ఇకెవైసి చేయించుకోవాలి

ప్రజాశక్తి-రాజవొమ్మంగి : రైతులు ఈ నెల 31లోగా ఈకేవైసీ చేయించుకోవాలని స్థానిక వ్యవసాయ అధికారి రమేష్ నాయుడు బుధవారం తెలిపారు. రైతులు మీసేవ ద్వారా, లేదా ఓటీపీ ద్వారా ఈకేవైసీ తప్పనిసరిగా చేయించుకోవాలని, అటువంటి వారికి జనవరి నెలలో పిఎం కిసాన్ సంబంధించిన సొమ్ము వారి ఖాతాలో జమ అవుతుందని చెప్పారు.

ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్

విశాఖ జిల్లా అధ్యక్షునిగా సోమశేఖర్



సోమశేఖర్‌ను అభినందిస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

ప్రజాశక్తి- విశాఖపట్నం : ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్, విశాఖపట్నం అధ్యక్షునిగా జోగి సోమశేఖర్ నియమితులయ్యారు. బుధవారం కంచరపాలెం జాతీయ రహదారిలోని గిరీశా శ్రీచైతన్య ఇంగ్లీష్ మీడియం పబ్లిక్ స్కూల్‌లో అసోసియేషన్ రాష్ట్ర చైర్మన్ సుందర్‌రామ్, ప్రధాన కార్యదర్శి జనార్ధన, జివైపిఎస్ఎ అధ్యక్షుడు భాస్కరరావు,కౌన్సిల్ సభ్యుల సమక్షంలో జరిగిన సమావేశంలో సోమశేఖర్‌ను అసోసియేషన్ విశాఖపట్నం అధ్యక్షునిగా నియమించి, సత్కరించి, అభినందిచారు. ఇదే సమయంలో విజయనగరం, పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం జిల్లాల అసోసియేషన్ అధ్యక్షులుగా తమ్మినేని సింహాచలం, డి.రామకృష్ణారావు, గట్టి పాపారావులను నియమించారు. ఈ సందర్భంగా సోమశేఖర్ మాట్లాడుతూ, అసోసియేషన్ విశాఖపట్నం శాఖ అభివృద్ధికి, ప్రైవేట్ స్కూల్స్ ఐక్యతకు కృషి చేస్తానన్నారు. అసోసియేషన్ అభివృద్ధికి రాష్ట్ర అధ్యక్షుడు సుందరరావు పలు సూచనలు చేశారు. పలు ఉత్తర్వులకు సంబంధించిన ఫైల్స్‌ను రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జనార్ధన్ అందజేశారు. సోమశేఖర్‌కు తమ అసోసియేషన్ తరపున పూర్తి సహాయ సహకారాలను అందిస్తామని భాస్కరరావు వెల్లడించారు. అనంతరం విశాఖపట్నం డిఇఒ చంద్రకళ కలిసి, అసోసియేషన్ విధివిధానాలను వివరించారు.